ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ



దుండిగల్ మున్సిపాలిటీలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణ తెలిపారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో రెవెన్యూ మేళా నిర్వహిస్తామన్నారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను స్వీకరిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారమిస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు దుండిగల్ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నామని అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలపై 90 శాతం మాఫీ చేస్తామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎవరైనా చెల్లించని పక్షంలో 90శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని తరువాత సంవత్సరం చెల్లించాల్సిన ఆస్తిపన్నులో సర్దుబాటు చేస్తామన్నారు.

'ఆలయ అభివృద్ధికి నా సహకారం ఉంటుంది'

నిజాంపేట్: భౌరంపేట్ ఎల్లమ్మ తల్లి ఆలయం కమిటీ సభ్యులు ఆలయానికి ఫ్లోరింగ్ పనులకు సహాయ సహకారాలు అందించాలని కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిపై స్పందించిన ఆయన ఆలయాభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఆలయ వైస్ ప్రెసిడెంట్ నరేష్, ట్రెజరర్ దుర్గ, జనరల్ సెక్రెటరీ నాయుడు, జాయింట్ సెక్రెటరీ లోకేష్, మధు, సురేష్, బాబు, కోటి, వంశీ, సాయి తదితరులు ఉన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా, డిటిజల్ మీడియా కో.ఆర్డినేటర్ యడ్లపల్లి వాసు ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రఫియా బేగం

నిజాంపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేట్ 23వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రఫియాబేగం కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు హన్మంతరెడ్డి కాంగ్రెస్ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే బిక్కన్‌షా, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహావిష్కరణ



ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: భారత దేశానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో సేవలందించిందని.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ గ్రామంలో ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్ రావు, ఆకుల ప్రేమ్, సురారపు కృష్ణ, పి.మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో విలీనం!

• నగర శివారులో 30 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు • విధివిధానాలను రూపొందించాలని సీఎం ఆదేశం



నిజాంపేట్: శివారు ప్రాంతంలోని 30 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను గ్రేటర్‌లో విలీనం చేసే ప్రక్రియపై పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిని యూనిట్‌గా తీసుకుని ఒకే గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడం లేదా 4 నాలుగు కార్పొరేషన్లుగా విభజించడం అనే అంశాలపై పూర్తిస్థాయిలో విధివిధానాలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రేటర్ విలీనం అంశం తెరపైకి రావడంతో పార్టీల నేతల్లో నిరాశ నెలకొందా! గత ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ టికెట్ దక్కకపోవడంతో నిరాశ చెందిన నాయకులు కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా అవకాశం వస్తే పోటీ చేయాలని సిద్ధంగా ఉన్నారు. కానీ ఆ నేతలకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఖంగు తినిపించినట్లయ్యింది.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలు

కుత్బుల్లాపూర్ నియోజవకర్గంలోని నిజాంపేట్ కార్పొరేషన్‌లో 33 వార్డులకు 33 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇక్కడ సుమారు 3 లక్షల వరకు జనాభా ఉంది. ఓటర్లు సుమారు 1.60 లక్షల ఓటర్లు ఉన్నారు.

◆ దుండిగల్ మున్సిపాలిటీలో 28 వార్డులు ఉండగా ఇక్కడ 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇక్కడ సుమారు 1.30 లక్షలకు పైగా జనాభా ఉండగా ఓటర్లు సుమారు 45వేల మంది ఉన్నారు.

◆ కొంపల్లి మున్సిపాలిటీలో 18 వార్డులు ఉండగా ఇక్కడ 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఓటర్లు సుమారు 26 వేల వరకు ఉండగా జనాభ సుమారు 70 వేల వరకు ఉంటుంది.

◆ గ్రేటర్, మున్సిపాలిటీల కలయిక కుత్బుల్లాపూర్ నియోజకవర్గం..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గ్రేటర్‌లోని 8 డివిజన్లు గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, రంగారెడ్డినగర్, సూరారం, జీడిమెట్ల, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్లతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల కలయికగా ఉంది. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పరిపాలన, అభివృద్ధి, నిధుల కేటాయింపు అన్ని బిన్నంగానే ఉంటాయి. ఒకే నియోజకవర్గం అయినప్పటికీ ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన పాలన ఉండటం కుత్బుల్లాపూర్ ప్రత్యేకత.

◆ లీడర్ డీలా....

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 33 వార్డులకు సుమారు 150 మందికి తగ్గకుండ వివిధ పార్టీల నుంచి కాకుండా స్వతంత్రగా పోటీ చేసే లీడర్ల సంఖ్య ఉండేది. ఇక కొంపల్లి, దుండిగల్ మున్సిపల్‌ల పరిధిలో 46 వార్డుల్లో కనీసం 200లకు తగ్గకుండా నేతలు పోటీ చేసేందుకు ఉత్సహంగా ఉన్నారు. ఒక్క సారిగా గ్రేటర్‌లో విలీనం అనే సరికి గ్రేటర్ నిభందనల మేరకు ఎన్ని డివిజన్లు వస్తాయి. అందులో డివిజన్ విస్తీర్ణం పెరగడంతో పోటీ తీవ్రమవుతుందని లీడర్లు డీలా పడుతున్నారు.

◆ ఏది ఏమైన ప్రభుత్వం నిర్ణయంతో రాజకీయ అవకాశాలు కొంత నాయకులకు నిరాశ మిగిల్చినప్పటికీ ప్రాంతాల అభివృద్ధి జరిగితే బాగుటుందనేది సామాన్య ప్రజల భావన. విలీనంతో సరిపెట్టకుండా సరిపడ నిధులు సైతం మంజూరు చేసి ప్రజలకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విలీనం అయితే డివిజన్ల పరిస్థితి ఏంటి..?

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు గ్రేటర్‌లో విలీనం అయితే ఇటు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నియోజకవర్గల్లోని ప్రాంతాలతో పాటు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం, గాజులరామారం లాంటి డివిజన్లతో కలిసి సమాన జనాభాతో డివిజన్లు ఏర్పడే అవకాశం ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసి సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసి స్థానిక సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే సుపరిపాలన అందుతుందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. అదే విధంగా పలువురు శుభ కార్యాలకు రావాలని ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన భరతసింహారెడ్డి స్థానికంగా పర్యటించారు. డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ రాజ్, నరేష్, యశ్వంత్, అరవింద్, వెంకటేష్, యాదగిరి, శంకు, రాజు, రాకీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను కూల్చినా ఊరుకోని కబ్జారాయుళ్లు



ప్రభుత్వ స్థల కబ్జాను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున గుమిగూడిన స్థానికులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాన్ని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు కూల్చినా కబ్జాదారులు ఊరుకోవడం లేదు. ఖచ్చితంగా ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టి లక్షలకు అమ్ముకోవాల్సిందేనని కంకణం కట్టుకున్నారు. గాజులరామారం ఇందిరమ్మ కాలనీని ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 12లో కొంతమంది ఇటీవల గది నిర్మించగా స్థానికులు ఫిర్యాదు మేరకు రెండుసార్లు కూల్చివేశారు. **అయినప్పటికీ శనివారం రాత్రి తిరిగి నిర్మాణం చేపట్టేందుకు** అక్కడికి రాగా స్థానికులు పెద్ద ఎత్తున పోగై అడ్డుకున్నారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విలువైన స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నిస్తున్న సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే మూడుసార్లు కబ్జాకు యత్నించిన వ్యక్తులపై సంబంధిత అధికారులు ఎందుకు కేసు నమోదు చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

తెల్లవారుజామున కార్డన్ సెర్చ్

సుభాష్‌నగర్: మేడ్చల్ డీసీపీ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున ఏసీపీ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్, దుందిగల్, సురారం పోలీస్‌స్టేషన్ల సిబ్బంది కై సర్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 06 ద్విచక్రవాహనాలు, 25 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో మొత్తం 65 మంది పోలీసులు పాల్గొన్నారు. ఎవరైనా అనుమానితులు ఉంటే తమకు తెలియజేయాలని స్థానికులకు తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరికీ ఇళ్లను అద్దెకు ఇవ్వవద్దని ఏసీపీ శంకరరెడ్డి సూచించారు.



కైసర్‌నగర్‌లో కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేపడుతున్న పోలీసులు



నగరాలను చుట్టేస్తున్నాడు

ప్రజల జీవన విధానాలు, వాతావరణ పరిస్థితులు తెలుసుకోవడానికే అంటున్న అశుతోష్

సుభాష్‌నగర్: దేశంలోని వివిధ ప్రాంతాల్లో జీవన విధానాలు అక్కడి పరిస్థితులు తెలుసుకోవడానికి ఓ యువకుడు దేశాన్ని చుట్టుముట్టే యాత్ర చేపట్టాడు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన 6.6 అడుగుల అశుతోష్ (32) బయోకెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాలలో అక్కడ జీవన విధానాలు, వాతావరణ పరిస్థితులపై సెర్ఫింగ్ చేసి వెబ్‌సైట్‌లో పొందుపరచాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియన్ టూర్ పేరుతో 2023 మార్చ్‌లో ఈ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికీ పది రాష్ట్రాలలో 13,500 కిలోమీటర్లు సైకిల్‌పై వివిధ నగరాలను చుట్టూ ముట్టినట్లు తెలిపారు. ఆదివారం సుచిత్ర మీదుగా 44వ జాతీయ రహదారిపై నాగపూర్ వైపు వెళ్తుండగా 'సాక్షి'ప్రతినిధికి తారసపడటంతో పైవిధంగా పేర్కొన్నారు.



సుచిత్రలో స్థానికుడు సాయిని ఇక్కడి విషయాలు అడిగి తెలుసుకుంటున్న అశుతోష్

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్: అభివృద్ధిని చూసి ప్రజలు తనను మరోసారి గెలిపించారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్ కాలనీలో రూ.36లక్షలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి వేర్వేరుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కాలనీల్లో మౌళిక వసతులు కల్పనకు అధిక నిధులు వెచ్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లాగౌడ్, శ్రీదేవి రెడ్డి, గాయత్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమేర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాల్సిన స్థలంలో వ్యర్థాలు



గాజులరామారం- షాపూర్‌నగర్ రోడ్డులో చెత్త వ్యర్థాలతో నిండిపోయిన డివైడర్

రంగారెడ్డినగర్: పచ్చని మొక్కలతో ఉండాల్సిన డివైడర్లు చెత్త డంపింగ్‌కు అడ్డాగా మారుతున్నాయి. గాజులరామారం నుంచి షాపూర్‌నగర్ చౌరస్తా వరకు 2 కిలోమీటర్ల మేర రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో మొక్కలను నాటేందుకు మట్టితో నింపిన సర్కిల్ అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదు. దీంతో ఇదే అదనుగా భావించి కొందరు డివైడర్ల మధ్యలో వ్యర్థాలను డంప్ చేయడంతో దుర్గంధంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సర్కిల్, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి డివైడర్ల మధ్యలో నీడనిచ్చే చెట్లను, ఆహ్లాదాన్ని పంచే పూల మొక్కలను నాటాలని పలువురు కోరుతున్నారు.

వ్యర్థాల ఏరివేతకు ప్రభుత్వ ఆస్పత్రి కేంద్రం!



షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అట్టలను ఏరుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

రంగారెడ్డినగర్: వ్యర్థాల ఏరివేతకు ప్రభుత్వ ఆస్పత్రి **కేంద్రంగా** మారింది. షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య **కేంద్రంలో** ఆదివారం ఓ పక్క వైద్య సిబ్బంది పల్స్ పోలియో చు**క్కల కార్య**క్రమంలో నిగ్నమై ఉండగా మరో పక్క పారిశుద్ధ్య సిబ్బంది ఆస్పత్రి ఆవరణలోనే చెత్త ఏరివేతను చేపట్టారు. ఆటోరిక్షా కార్మికులు ఇళ్లలో సేకరించిన చెత్తను ఆస్పత్రి సమీపంలోని డంపింగ్ కేంద్రంలో వేయగా, వాటిలోని అట్టలను పారిశుద్ధ్య సిబ్బంది తీసుకువచ్చి ఆస్పత్రి ఆవరణలో వేరు చేస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మన్పించింది. పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆరోగ్య కేంద్రాన్ని పారిశుద్ధ్య సిబ్బంది చెత్త డంప్ ఏరివేతకు అడ్డగా మార్చడం విమర్శలకు తావిస్తోంది.

నిండు జీవితానికి రెండు చుక్కలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లు, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు, నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 70,112 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారిణి నిర్మల తెలిపారు. మొత్తం 96 శాతం మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన పిల్లలకు సైతం వారి ఇళ్లకు వెళ్లి తమ సిబ్బంది పోలియో చుక్కలు వేస్తామని మండల వైద్యాధికారిణి పేర్కొన్నారు.

– కుత్బుల్లాపూర్



పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



డి.పోచంపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ



బౌరంపేటలో.. కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



సుభాష్‌నగర్‌లో.. కార్పొరేటర్ హేమలత



కొంపల్లిలో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



రంగారెడ్డినగర్ బస్తీ దవాఖానాలో చుక్కలు వేస్తున్న డాక్టర్ వేణు



కొంపల్లిలో చుక్కలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్



గాంధీనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో..